తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) 1988 ఉగాది మినీ కథల పోటీలో రు. 150 లు గెలుపొందిన కథ

# 'అజాత శత్రువే అలిగిన నాడు'

పి. వెంకట్రామిరెడ్డి



"రవిబాబూ! పట్నం పోతున్నాను. ఏ ఇత్తనం బాగుంటదో కొంచెం రాసివ్వు. తెచ్చుకుంటాను" చంద్రయ్య ఆ రోజు పొద్దున్నే వచ్చి అడిగాడు. బావి కింద తనకున్న అయిదెకరాలలోను పత్తి వేయనున్నట్టు ఆ ముందురోజే నాతో చెప్పాడు. ఒక హైబ్రిడ్ వెరైటీ పేరు చీటీ మీద వ్రాసి చంద్రయ్య చేతికిచ్చాను.

నేను బి.ఎస్సీ. అగ్రికల్చర్ చదివి,ఉద్యోగం చేయడం ఇష్టంలేక మా ఊళ్లోనే మాకున్న పొలాన్ని సాగు చేయిస్తున్నాను. నాక్కొంచెం కొత్తవిషయాలు తెలుసన్న ఉద్దేశంతో మా ఊళ్లోని రైతులు అప్పుడప్పుడు నా సలహా కొరకు వస్తుంటారు. రెండేళ్ల కిందట పత్తిలో రైతులకు పెద్ద దెబ్బ తగిలింది. దాంతో ఇంకా కోలు కోలేదు. అందుకే పోయిన సంవత్సరం పత్తి వేయడాని కెవ్వరూ సాహసించలేదు. అయితే ఆశ్చర్యంగా వేసిన కొందరికి మంచి లాభాలు వచ్చాయి. అంతే! మళ్లీ ఈ సంవత్సరం పత్తి మీద పడ్డారు. కాని నాకు మాత్రం ఈసారి పత్తి వేయబుద్ధి కాలేదు. పంట వస్తే ధర వుండదు. ధరలున్నప్పుడు పంట రాదు. అందుకే పెద్ద లన్నారు పత్తి తెల్లపాము లాంటిదని, దాని కాటుకు తిరుగుండదని.

ఆ రోజు పొద్దున్నే మా ఇంటికి వీరారెడ్డి వచ్చాడు. ఆయన వ్యవసాయంలో మంచి అనుభవమున్న మధ్యతరగతి రైతు. "రవీ! చంద్రయ్యకు నువ్వు రాసిచ్చిన రకం విత్తనాన్నే మనూళ్లో చాలామందిమి తెచ్చుకున్నాము. అయితే వేసి పదిరోజులవుతున్నా పూర్తిగా మొలకెత్త లేదు. ఏం ఫాల్టుందో నువ్వొచ్చి చూస్తావా?" అనడిగాడు.

నాకాయన చెప్పింది విని చాలా ఆశ్చర్యమేసింది. లేటెస్ట్ హైబ్రిడ్ వెరైటీ పేరు వ్రాసిచ్చాను. అది మొలకెత్తకపోవడమంటే నమ్మశక్యం కాలేదు. వెళ్లి చూశాను. అందరి పొలాలూ అలానే వున్నాయి. అందరూ ఒకే చోట విత్తనాన్ని తెచ్చారట. ఆలోచించాను. బాగా ఆలోచించిన మీదట విషయం అవగతమైంది. సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్లు, సీడ్ మర్చెంట్స్ కుమ్మక్కై గిరాకీ పెరుగుతున్న ఆ హైబ్రిడ్ సీడ్‌లో సగం పుచ్చిన విత్తనాలు కలిపి ఎక్కువ రేటుతో అమాయకులైన ఈ రైతుల కంటగట్టారు.

కొందరు ఆ పంటను చెడగొట్టి, మళ్ళీ పంట వేసుకోవడానికుపక్రమించారు. అయితే మళ్లీ పంటకు డబ్బులు పెట్టలేని చంద్రయ్యలాంటివాళ్ళు మాత్రం వున్న సగం పంటతోనే తృప్తిపడ్డారు. ఉన్నంతలో మొక్కలు బాగానే పెరుగుతున్నాయి. ప్రాప్తం వున్నంత వరకు అందుతుందని చంద్రయ్య సంబరపడేవాడు. రెండేళ్లుగా తీర్చలేకపోతున్న అప్పులను ఆ సంవత్సరం తీర్చగలనని చంద్రయ్య నాతో ఎన్నోసార్లు చెప్పేవాడు. అతడూ, అతని కుటుంబం పొద్దున్నుంచీ నిద్రపోయే దాకా ఆ పొలంలోనే రెక్కలు ముక్కలు చేసుకునేవారు.

నేను కూడా అప్పుడప్పుడు వెళ్లి చంద్రయ్య పొలాన్ని చూసేవాణ్ణి. పంట పూత బాగా పట్టింది.

కాని అంతలోనే...

చంద్రయ్య కలలను హరించే మహమ్మారిలా... మా ప్రాంతాన్ని కబళించడానికొచ్చిన పెను తుఫానులా... పత్తి వేసే రైతులకు ఆగర్భ శత్రువుగా పరిణమించిన తెల్లదోమ రానే వచ్చింది. పూత, పిందె అర్థాయుష్షులోనే రాలిపోతున్నాయి. పవర్‌ఫుల్ మందులు వ్రాసిచ్చాను. పెళ్లాం మెళ్ళో తాళిబొట్టు తాకట్టుపెట్టి మరీ అప్పుతెచ్చి మందులు కొనుక్కొచ్చి కొట్టాడు.

వారం తర్వాత ఎలా వుందోనని చంద్రయ్య పొలం వైపు వెళ్లాను. ఇంతకుముందు కళకళలాడుతూ నిండు లక్ష్మిలా కనబడ్డ ప్రత్తిచేను మానభంగానికి గురైన ఆడపడుచులా కళావిహీనంగా కనబడింది. నాకెందుకో గుండె పిండినట్లైంది. కనీసం మళ్లీ వచ్చే పూతనైనా నిలబెట్టాలన్న ఉద్దేశంతో, నేనే డబ్బులిచ్చి ఇంకా ఖరీదైన, పవర్‌ఫుల్ పెస్టిసైడ్స్ తెచ్చి కొట్టమన్నాను. ఈసారి కొంచెం ఫలితం కనబడింది. గుడ్డి కంటే మెల్ల

మేలన్నట్టు ఊరికే పోకుండా కాస్త దిగుబడి రావచ్చు.

అంతలోనే అశనిపాతంలా...

పాపం చేయడంలో మనుషులకేమాత్రం తీసిపో మన్నట్టు అకాలంగా విజృంభించాయి గాలి,వాన దేవుళ్లు. మరుసటిరోజు పొలంవైపు వెళితే-శత్రువులు కొల్లగొట్టిన సామ్రాజ్యంలా వుంది. పంటలన్నీ తమ ఉనికినే కోల్పోయి నేలకొరిగాయి.

ఆ రోజు రాత్రి చంద్రయ్యను చూస్తుంటే గుండె తరుక్కుపోయింది. ఒక్క నయాపైస పంట లేకుండా తాను చేసిన అప్పులన్నీ ఎలా తీర్చాలన్నాడు. తాను, పెళ్ళాం, పిల్లలు ఏం తిని బతకాలన్నాడు. తమకే దేవుడు మేలు చేస్తాడన్నాడు.

గవర్నమెంటు పంటలకు నష్టపరిహారం చెల్లిస్తుందిలే అని చెప్పాను.

"ఇంతకు ముందు కూడా ఇలా చాలాసార్లు చెప్పారు బాబూ! కాని మనూళ్లో ఏ రైతూ యింతవరకు గవర్నమెంటోల్ల డబ్బు మొగం చూడలేదు. అవన్నీ పైనోళ్లే తింటారు" బాధగా చెప్పాడు చంద్రయ్య.

ఆ విషయం నాకూ తెలుసు. అందుకే మౌనంగా వుండిపోయాను.

ఆ రాత్రి నాకెంతకూ నిద్రపట్టలేదు. ఒకటే ఆలోచనలు. రైతునుద్ధరించేదెవ్వడు? ఈ వ్యవసాయ ప్రధానదేశంలో ఓటమి రైతు జన్మహక్కులా మిగిలిపోయింది. అగ్రికల్చర్‌లో రేయింబవళ్లు రీసెర్చి చేసి డిగ్రీలు



పెంచుకునే సైంటిస్టులూ, రైతే రాజని మొత్తుకునే రాజకీయ నాయకులు... వీళ్ళెవరూ ప్రాక్టికల్‌గా రైతు కష్టాలను పరిశీలించడంలేదు. వారి వారి పర్సనల్ డెవలప్‌మెంట్‌కు రైతునో నిచ్చెనలా వాడుకుని వదిలేస్తున్నారు. దేశానికి వెన్నెముకగా అభివర్ణించబడిన రైతు నడ్డి విరిగి కూలబడుతుంటే ఎవడూ పట్టించుకోడేం? ఎక్కడి కెళ్లినా రైతుకు నిరాదరణే. ఏదో చెయ్యాలి... ఏం చెయ్యాలి? ఈ ఆలోచనంతో తెల్లవారుఝాము నెప్పుడో నిద్రపట్టింది.

పొద్దున లేవగానే మా పక్కింటి రాముడు చెప్పిన విషయం విని కొయ్యబారిపోయాను.

"చంద్రయ్య ఇంటిల్లిపాదీ పురుగుల మందు తాగి చచ్చిపోయారంట"

నా గుండెకుంపట్లో ఆలోచనలు రగులుకుంటు న్నాయి.

'ఓ రైతన్నా! నీ కన్నీళ్లు తుడిచే చేతులే కరువై, నీలో నీవు కుమిలి కుమిలి నిస్సహాయంగా నీకై నువ్వే నీ జీవితాంకానికి మధ్యలోనే తెర దించుకున్నావా? తమకు చీమ కుట్టినంత కూడా నష్టం జరగకముందే సమ్మెలకు దిగే ఉద్యోగుల్లా, కార్మికుల్లా, లాయర్లలా నీకు జరిగే అన్యాయానికి నువ్వెవ్వరినీ నిందించవు. నువ్వో సాధు జంతువు లాంటివాడివి. ఇంక ఇలా కుదరదన్నా! 'అలుగుటయే ఎరుంగని అజాతశత్రువే అలిగిన నాడు సాగరములన్నియు నేకము గాకపోవు...' అన్నట్టు నువ్వు విజృంభించిననాడు నిన్ను వంచిస్తున్న రాజకీయ నాయకుల, వ్యాపారస్తుల, ఉద్యోగుల పునాదులే కదులుతాయి. భారత మాతకు 'గుండె' వైన నువ్వే నిర్జీవమైననాడు దేశమే లేదన్నా!'

ఆలోచనల నుంచి తేరుకోకుండానే పేపరు తీశాను. నా ఊహలకు ఊపిరి పోస్తూ పేపర్ తీయగానే మొదటి పేజీలోనే హెడ్‌లైన్స్ కనబడ్డాయి.

"మీరట్‌లో ఉధృతమైన రైతు ఉద్యమం."

* *


మా ఇంటర్ విద్యార్థుల-విజయకీర్తి,గురుకుల విద్యావ్యవస్థకే ఘనకీర్తి

**అమరావతి రెసిడెన్షియల్ కాలేజి**

మెడికల్ కాలేజి రోడ్,జిల్లాకోర్టు ఎదుట,గుంటూరు-4. PHONE: 21665

**నూటికి నూరు శాతం** (100% 1St CLASSES).
సాధించిన ఇంగ్లీషు మీడియం M.P.&Bi.P. విద్యార్థులకు మా అభినందనలు
ఇంటర్ M.P.,Bi.P.,C.E.C.(తెలుగు మీడియం) ఉత్తీర్ణత 94.5%
ఇంటర్ అన్ని గ్రూపుల ఉత్తీర్ణత: 95.6%

**జూనియర్ ఇంటర్ అడ్మిషన్ నోటీస్**
M.P; Bi.P ( ఇంగ్లీషు మరియు తెలుగు మీడియం)
C.E.C (తెలుగు మీడియం మాత్రమే) అడ్మిషన్లు 6-6-88 నుండి
M.P. గ్రూపుకు ప్రవేశ అర్హత X$^{th}$ 1st CLASS.
Bi.P. గ్రూపుకు ప్రవేశ అర్హత X$^{th}$ 2nd CLASS.

**మెరిట్ స్కాలర్‌షిప్స్ ఇస్తున్న ఏకైక సంస్థ!**

పదవ తరగతిలో సాధించిన మార్కుల ప్రాతిపాదికపై మావద్దచేరు జూనియర్ ఇంటర్ విద్యార్థులకు **మెరిట్ స్కాలర్ షిప్** యివ్వబడును. మెరిట్ స్కాలర్ షిప్ వివరాలు ప్రాస్పెక్టస్‌లో పొందుపరచబడినవి. జూనియర్ ఇంటర్‌కు పై గ్రూపులలో అడ్మిషన్లు, ఇంటర్వ్యూ మరియు **ఓరల్ టెస్ట్** ద్వారా జరుగును. ఓరల్ టెస్టు సిలబస్ వివరములు ప్రాస్పెక్టస్‌లో పొందుపరచబడినది. ప్రాస్పెక్టస్ మరియు అప్లికేషన్‌లను స్వయముగా సంప్రదించిగాని లేక కార్డు వ్రాసిగాని పొందండి.

గమనిక:- **సీనియర్ ఇంటర్ క్లాసులు 6-6-1988 నుండి పునః ప్రారంభము.**

డైరెక్టర్
**అమరావతి రెసిడెన్షియల్ కాలేజి.**

ADITYA